క్లుప్తంగా

సెల్ఫీ పాయింట్‌గా.. రైల్వే ఓవర్ బ్రిడ్జి



చూపరులను ఆకట్టుకుంటున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): అన్నపురెడ్డిపల్లి మండలం శాంతినగర్ వద్ద నిర్మించిన రైల్ ఓవర్‌బ్రిడ్జి ప్రయాణికులను ఆకట్టుకుంటోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో సత్తుపల్లిలోని సింగరేణి ఓపెన్‌కాస్టు నుంచి బొగ్గును తరలించేందుకు రైల్వే ట్రాక్ నిర్మాంచారు. ఇందులో భాగంగా శాంతినగర్ గ్రామం వద్ద రూ.93 కోట్ల వ్యయంతో రైల్ ఓవర్ బ్రిడ్జిని నిర్మాణం చేశారు. అర్ధచంద్రాకారంలో అత్యాధునిక విధానంలో నిర్మించిన బ్రిడ్జి చూపరులను ఆకట్టుకుంటోంది. జాతీయ రహదారిపై రాకపోకలు చేసే ప్రయాణికులు కొద్దిసేపు ఆగి ఈ బిడ్జిపై సెల్ఫీలు దిగుతున్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ ప్రభాకర్

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలని డీఎల్‌పీఓ ప్రభాకర్ సూచించారు. మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని పంచాయతీ కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాలు పడుతున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలని, చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు తీసివేయాలని కోరారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

రహదారికి మరమ్మతులు చేయాలి

భద్రాచలంఅర్బన్: ఇసుక లారీల కారణంగా ధ్వంసమైన రహదారులను మరమ్మతులు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి.నర్సారెడ్డి, కారం పుల్లయ్యలు అన్నారు. ఈ మేరకు సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భద్రాచలం బ్రిడ్జి సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. భద్రాచలం నియోజకవర్గంలో దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం మండలాల్లో ఇసుక రీచ్‌ల కారణంగా నియోజకవర్గంలోని రోడ్లు మొత్తం ధ్వంసం అవుతున్నాయని, ఈ సమస్య పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు విమర్శించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బందారు శరత్ బాబు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకట రామారావు, పి.సంతోష్ కుమార్, కుంజ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కళాశాలలో వైద్యశిబిరం



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసిన డాక్టర్ ప్రియాంక.. అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వంటశాలలను, పరిసరాలను ఆమె పరిశీలించారు. కళాశాల ప్రిన్స్‌పాల్ ఎస్‌కె.బురాన్, వైద్యసిబ్బంది ప్రకాష్‌రావు, కోటేశ్వరరావు, దుర్గాభవాని, నాగమణి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మణుగూరురూరల్: మండల పరిధిలోని ఆదివాసీ గ్రామమైన రేగులగండిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ నాయకుల బృందం రేగులగండి గ్రామాన్ని సందర్శించి సమస్యలను పరిశీలించారు. సత్రపల్లి సాంబశివరావు మాట్లాడుతూ.. గ్రామంలో అంతర్గత వీధులు అధ్వానంగా ఉన్నాయని, సరైన రహదారి లేదని అన్నారు. సోలార్ విద్యుత్ లైట్లు మరమ్మత్తులకు గురయ్యాయని, పాఠశాల ప్రహరీగోడ లేక పోవడంతో చుట్టూ వరద నీరు చేరి దోమలు వృద్ధి చెందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, గుండి భీమయ్య, కారం భీమయ్య, గంగరాజు, దేవయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ఆదాయానికి మోకాలడ్డు

- 20 ఏళ్ల నాటి ఒప్పందానికి అనుగుణంగా అద్దెలు
- నూతన ఒప్పందం కుదిరితే పెరగనున్న ఆదాయం
- ఆ మేరకు మార్కెట్ కమిటీ నిర్ణయం
- పరోక్షంగా అడ్డుపడుతున్న అధికారులు



మార్కెట్ కమిటీ పరిధిలోని షాపులు ఇవే..

భద్రాచలంటౌన్: భద్రాచలం వ్యవసాయ మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌ల విషయంలో తీవ్ర గందరగోళం నెలకొంది. అధికారులు వ్యవహరిస్తున్న తీరే ఇందుకు కారణం. పాలకమండలి నిర్ణయాలు.. అధికారులు భిన్నంగా వ్యవహిస్తుండడంతో సమ్యలు తలెత్తుతున్నాయి. మార్కెట్ ఆదాయనికి గండిపడుతోంది.

వివాదం ఏమిటి?

వ్యవసాయ మార్కెట్ అధికారులు, అప్పటి పాలక మండలి సభ్యులు 21 షాపుల నిర్మాణానికి అద్దెకు తీసుకున్నవారితో 2003లో ఒప్పదం చేసుకున్నారు. నిర్ణయించిన సమయంలో ఒక్కొక్క గదికి రూ.40 వేల డిపాజిట్‌ను వసూల్ చేశారు. అదే సమయంలో డిపాజిట్ చేసిన వారికి 20 ఏళ్లు స్వల్ప అద్దె చెల్లిస్తూ వినియోగించుకునే విధంగా ఒప్పదం చేసుకున్నారు. ఆ చొప్పున 2003 నుంచి 2024 వరకు 20ఏళ్ల ఒప్పదం ముగిసింది. పాత ఒప్పదం తొలగించి కొత్త ఒప్పదం కుదుర్చుకోవడంలోనే వివాదం తలెత్తింది.

హడావుడిగా ఏడాది పొడిగింపు

షాపుల 20 ఏళ్ల ఒప్పందం ముగియడంతో అధికారులు మరలా పాత వారితోనే స్వల్పంగా అద్దె, డిపాజిట్‌ను రూ.46 వేలతో మళ్లీ ఏడాది పాటు ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తుంది. వాస్తవానికి ఒప్పదం నిర్ణయం తీసుకోవాల్సింది పాలకమండలి. అయితే కొత్త పాలకవర్గం ప్రమాణస్వీకారానికి కొన్ని రోజుల ముందే అధికారులు హడావిడిగా ఈ ఒప్పద ప్రక్రియ జరిపిన్నట్లు సమాచారం.

పాలకవర్గం నిర్ణయాలు బేఖాతరు

అధికారులు హడావిడిగా ఒక సంవత్సర ఒప్పందం కుదుర్చుకున్న విషయాన్ని కొత్త పాలకవర్గ సభ్యులు తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో ఒప్పందం రద్దు చేయాలని తీర్మానం చేశారు. ఆ ప్రకారం అధికారులు పాతవారికి నోటీసులు జారీ చేసి ఖాళీ చేయించాల్సి ఉంది. కాని అధికారులు మాత్రం ఆ తీర్మానాలను లెక్కజేయడం లేదని, పాతవారిని ఖాళీ చేయించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అధికారుల తీరుపై పాలకవర్గం సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

అధికారుల నిర్లక్ష్యం ఎందుకు?

పాలకవర్గ నిర్ణయాన్ని తొసిపుచ్చడంలో అధికారుల ఉద్దేశాలను పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. వారి ఆరోపణల ప్రకారం.. ఇప్పటివరకు కాంప్లెక్స్ షాపుల నిర్వాహకులు పాత ఒప్పదం, నాటి ధరల మేరకు అద్దె చెల్లిస్తున్నారు. ఒప్పందం రద్దు అయితే మారిన కాలం, ధరలకు అనుగుణంగా కొత్త అద్దె ధరలు అమలులోకి వస్తాయి. అప్పుడు షాపుల నిర్వాహకులు ఎక్కువ మొత్తంలో అద్దె చెల్లించాల్సి ఉంటుంది. దానిని తప్పించుకునేందుకు కొత్త ఒప్పందానికి షాపు నిర్వాహకులు విముఖత చూపుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి అనుగుణంగా అధికారులు వ్యవహరిస్తున్నారని, అందుకోసం వారి నుంచి నెలనెల ముడుపులు పొందుతున్నారని తెలుస్తోంది. అందువల్లే ఈ వ్యవహారంపై అంటీముట్టనట్లు ఉంటూ.. పాలకవర్గ నిర్ణయాలను పెడచెవిన పెడుతున్నారని వినికిడి.

ఆదాయం కోల్పోతోంది ఇలా..

వ్యవసాయ మార్కెట్‌లోని 21 షాపుల్లో అద్దెకు తీసుకున్న వారు తాము స్వతహాగా వ్యాపారాలు నిర్వహించడం లేదని తెలుస్తోంది. దీనికి కారణం లేకపోలేదు. భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డులో షాపులకు భారీగా డిమాండ్ ఉంది. అద్దెలు సైతం భారీగానే ఉన్నాయి. ఈ విషయాన్ని వ్యవసాయ మార్కెట్ షాపులకు తీసుకున్న వారు ఆదాయంగా మలుచుకున్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు వారు రూ.5,600 చెల్లిస్తున్నారు. కాని అదే షాపులకు వేరొకరికి అద్దెకు ఇచ్చి, వారి నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ విధంగా మార్కెట్ కమిటీ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఈ ఆదాయాన్ని పాలకవర్గమే పొందేందుకు కొత్త ఒప్పదం అనివార్యం. కాని ఇందుకు అధికారులు మోకాళ్లడ్డుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై సంబంధిత మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు చొరవ తీసుకోవాల్సి ఉంది.

పోలీసుల విస్తృత తనిఖీలు

మవోయిస్టు అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం పలు ప్రాంతాల్లో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. కాగితాలను, ఐడీ కార్డులను పరిశీలించారు. అనుమానితులను విచారించి నిర్ధారించుకున్న తరువాత విడిచిపెట్టారు.



మణుగూరుటౌన్: వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ నాగబాబు



అశ్వారావుపేటరూరల్: వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై, పోలీస్ సిబ్బంది

మణుగూరుటౌన్: మండలంలోని ప్రధాన జంక్షన్లలో సీఐ నాగబాబు ఆధ్వర్యంలో పోలీసులు అన్ని మోటార్‌సైకిళ్లను, ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎస్‌ఐ రంజిత్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: భద్రాచలం సీఐ నాగరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్, కూనవరం రోడ్డు, చర్ల రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు బ్రిడ్జి సెంటర్‌లో గల ఉమ్మడి చెక్ పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేపట్టారు. ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

అశ్వారావుపేటరూరల్: భద్రాచలం రోడ్, పోలీస్ స్టేషన్ సెంటర్‌తోపాటు సత్తుపల్లి, జంగారెడ్డిగూడెం మార్గాల్లో ఎస్సై టియయాతి రాజు ఆధ్వర్యంలో వాహనాలను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వాపురం: సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. అనుమానిత వాహనాలను సీజ్ చేసి అందులో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

దుమ్ముగూడెం: ఎస్‌ఐ గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు పెద్దనల్లబల్లి, సీతానగరం ప్రధాన రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. గ్రామాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అనుమానస్పద వ్యక్తుల సంచారం ఉంటే స్థానిక పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు.

కరకగూడెం: ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని చిరుమల్ల గ్రామంలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. పలువురి వద్ద ఉన్న బ్యాగులు, వారి గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కరకగూడెం ఎస్సై పీవీఎన్.రావు, స్పెషల్ పార్టీ టీజీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



పినపాక: శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈఓ నాగయ్య



కరకగూడెం: శిక్షణలో అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ మంజుల

దమ్మపేట: ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను ఎలా బోధించాలనే అంశంపై సోమవారం మండలంలోని దమ్మపేట, గండుగులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ కీసర లక్ష్మి మాట్లాడుతూ.. పాఠ్యాంశాల బోధన తీరుపై పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల ప్రగతి నమోదును పాఠశాలల వారీగా ఉపాధ్యాయులతో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా పరిశీలన అధికారి అల్లూరి రెడ్డి, హెచ్ఎంలు మారెమ్మ, ఉషారాణి, వెంకటేశ్వరరావు, మస్తాన్‌వలీ, జగపతి తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల యూనిట్‌గా రెండు రోజుల పాటు నిర్వహించనున్న కాంప్లెక్స్ స్థాయి సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శిక్షణ సమావేశానికి మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల నుండి 21 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. సమావేశంలో మండల రిసోర్స్ పర్సన్స్ ద్వారా ఉపాధ్యాయులకు బోధనా నైపుణ్యాల మెరుగుదల, విద్యా ప్రదేశ్ వినియోగ విధానాలు, గ్రంథాలయ పుస్తకాల నిర్వహణ తదితర అంశాలపై ఎంఈఓ గడ్డం మంజుల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పినపాక: మండలంలోని దుగినేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి కాంప్లెక్స్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాన్ని ఎంఈఓ కొమరం నాగయ్య ప్రారంభించి మాట్లాడారు. విద్యాప్రవేశ్, పాఠశాలల్లో గ్రంథాలయ పుస్తకాల నిర్వహణలో ఉపాధ్యాయుల పాత్ర గురించి వివరించారు. రిసోర్స్ పర్సన్స్ ఈ సమావేశంలో ఉపాధ్యాయులకు సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పినపాక కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ రమణ, జానంపేట కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ విజయలక్ష్మి, మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

'నవోదయ' దరఖాస్తుకు నేడు చివరి గడువు

బూర్గంపాడు: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2026-27వ సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకునేందుకు జూలై29 (మంగళవారం)తో గడువు ముగుస్తుంది. 2025-26 విద్యాసంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు వచ్చే ఏడాది నవోదయ పాఠశాలల్లో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75శాతం సీట్లు కేటాయించారు. ప్రవేశం పొందితే 12వ తరగతి వరకు సీబీఎస్‌ఈలో ఉచిత విద్యను, వసతిని అందిస్తారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు మంగళవారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి యదుసింహరాజు తెలిపారు.

ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: మండలంలోని నందులచెలక గ్రామానికి చెందిన సోడె పండు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. బాధితుడికి తల్లిదండ్రులు చిన్నప్పుడే మృతి చెందడం.. నిరుపేద కుటుంబం కావడంతో ఆదివాసీ మహిళా చైతన్యశక్తి గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం రూ.10 వేలు అందజేశారు. భద్రాచలంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా.. అక్కడ ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అనసూయ, అరుణ, సోడి శ్రీదేవి, ఆశాలత, సోయం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి



ఖైదీలకు అందిస్తున్న సదుపాయాలపై ఆరా తీస్తున్న న్యాయమూర్తి భవాని

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని సబ్ జైలును సోమవారం భద్రాచలం జ్యుడీషియల్ కోర్టు ఫుల్ ఎడిషనల్ జడ్జి భవాని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె సబ్‌జైల్‌లోని వంటశాల, పరిసరాలను పరిశీలించారు. రిమాండ్ ఖైదీలకు ఫ్రీ లీగల్ ఎయిడ్, ఇతర చట్టాలపై అవగాహన కల్పించారు. పేద ఖైదీలకు న్యాయ సేవా సంస్థ ద్వారా డిఫెన్స్ లాయర్‌ను పెట్టి, బెయిల్ మంజూరు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సీపీఎం సర్వే



కేవీపురం గ్రామంలో సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు

దుమ్ముగూడెం: మండల పరిధిలోని భీమవరంలో సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య, కేవీపురంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ సోమవారం సర్వే నిర్వహించారు. భీమవరం గ్రామంలో నాలుగు నెలల క్రితం మంచినీళ్ల బోరింగ్ రిపేరు వచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని పుల్లయ్య అన్నారు. అలాగే కేవీ పురం గ్రామంలో స్కూల్లో టాయిలెట్ సరిగ్గా లేదని, మంచినీళ్ల బోరు పనిచేయడం లేదని వంశీ తెలిపారు. తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగా ఆగిపోయిందన్నారు. వెంటనే ఈ సమస్యలను తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అపక సత్యం, ఆపక చిన్నయ్య, రేసు నాగయ్య, వీరస్వామి, రాంబాబు, పూసం వెంకన్న బాబు, మాజీ సర్పంచ్ అచ్చిరాజు, కాక బుచ్చిరాజు, ఆలం రమేష్, కాక అనసూర్య, ఆలం రాజ్యలక్ష్మి, పూలమాద్రి రాము, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో రేగా పర్యటన

దుమ్ముగూడెం: బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు సోమవారం మండలంలో పర్యటించారు. ముందుగా తూరుబాక దగ్గర నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్‌ఎస్ మండల కో కన్వీనర్ యండి.జానీపాషా సోదరుడు ఖాసీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబానికి సంతాపం తెలియచేశారు.అనంతరం దుమ్ముగూడెం సొసైటీ దగ్గర రైతులు ఎరువుల కొరకు బారులు తీరిన విషయం తెలుసుకుని అక్కడికి వెళ్లారు.అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ మానే రామకృష్ణ, నాయకులు బొల్లి వెంకట్రావు, కొత్త మల్లేశ్వరరావు, కోత్తూరి సీతారామారావు, దామెర్ల శ్రీనివాసరవు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

మణుగూరురూరల్: మండల పరిధిలోని ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయతీలోని 30 కుటుంబాల వారు బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు వారికి బీఆర్‌ఎస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కుంట లక్ష్మణ్, మాజీ జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కమిటీలో పలువురికి స్థానం

అశ్వారావుపేటరూరల్: సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గం, కౌన్సిల్‌లో అశ్వారావుపేటకు చెందిన నలుగురికి అవకాశం దక్కింది. ఈ మేరకు అశ్వారావుపేటలో రెండు రోజులపాటు నిర్వహించిన జిల్లా మహాసభల్లో పార్టీ కార్యవర్గం, కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోగా.. పార్టీ జిల్లా కార్యవర్గంలో స్థానిక నియోజకవర్గ కార్యదర్శిగా పని చేస్తున్న ఎస్‌డి.సలీం ఎన్నికైయ్యారు. అలాగే పార్టీ సీనియర్ నాయకులు గన్నిన రామకృష్ణ, యువ నాయకుడు నూకవరపు విజయకాంత్, మహిళా నాయకురాలు చీపూర్ల సత్యవతికు జిల్లా కౌన్సిల్‌లో చోటు దక్కింది. కాగా, గతంతో పోల్చితే అశ్వారావుపేట మండలానికి జిల్లా కమిటీ, కౌన్సిల్‌లో అధిక ప్రాధాన్యత దక్కిందని చెప్పవచ్చు. జిల్లా మహాసభలను జయప్రదం చేయడం పట్ల పార్టీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

ములకలపల్లి: సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులుగా మహమ్మద్ యూసఫ్, నరాటి రమేశ్ నియమితులయ్యారు. అశ్వారావుపేటలో నిర్వహించిన పార్టీ జిల్లా మహసభలో నూతన కమిటీని ప్రకటించగా మండలానికి చెందిన ఇరువురికి స్థానం దక్కింది. కాగా నూతనంగా ఎన్నికైన సభ్యులకు బొప్పిడి ఇమ్మాన్యూయేల్, భైరు సాయిబాబ, అనుమల సాయి, వీరూ నాయక్, ఎస్‌కె.బజ్జార్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

పశువులను కట్టడి చేయాలి

మణుగూరుటౌన్: బాంబేకాలనీ, పీవీకాలనీ ప్రధాన రహదారుపైనే ఆవులు సంచరిస్తుండటంతో కార్మికుల కుటుంబ అవస్థలు పడుతున్నారని కూనవరం కార్యదర్శి ప్రసాద్‌కు టీబీజీకేఎస్ నేతలు సోమవారం ఫిర్యాదు చేశారు. టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ మాట్లాడుతూ.. రాత్రివేళ విధులకు రాకపోకలు సాగించే కార్మికులు తరచూ రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని, పశువుల కట్టడికి చర్యలు చేపట్టాలన్నారు. పోలీసుల సహకారంతో పశువుల యజమానులను క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడంతో పంచాయతీ అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కార్యదర్శి ప్రసాద్ భరోసానిచ్చారు.

తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం



తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్‌ను అందుకుంటున్న గాయని పూజారి జ్యోతి

మణుగూరురూరల్: భద్రాచలంలో భద్రాద్రి స్వరాంజలి ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన ప్రదర్శనలో మణుగూరుకు చెందిన గాయని పూజారి జ్యోతి పాల్గొని తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకుంది. ప్రముఖ గాయని చిత్ర పాడిన పాటలను 12 గంటల పాటు మరికొందరితో కలిసి ఆలపించిన జ్యోతి రికార్డు సాధించింది. ఈ మేరకు ఐటీసీ పాకాల దుర్గాప్రసాద్, అర్చకుడు కృష్ణచైతన్య, డాక్టర్ పాలరాజ్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ వరలక్ష్మీ సాయిరాం తదితరుల చేతుల మీదుగా ఆమె ప్రశంసాపత్రం అందుకోగా పలువురు అభినందించారు.

అసంపూర్తిగా తహసీల్దార్ భవనం

- నిధుల మంజూరు.. టెండర్‌లో జాప్యం
- రెండేళ్లుగా ఇబ్బందికరంగా తహసీల్ నిర్వహణ



అసంపూర్తిగా ఉన్న తహసీల్దార్ భవనం

గుండాల: భూ సమస్య ఉన్నా.. ఏదైనా సర్టిఫికెట్ కావాలన్నా.. మండల సమస్యలను విన్నవించుకోవాలన్నా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సిందే. కానీ ఇరుకుగదుల్లో ఉన్న తహసీల్దార్ కార్యాలయంలోకి ఒక్కొక్కరుగా లోపలికి వెళ్లి రావాలి. నూతన భవన నిర్మాణానికి నిధులు సకాలంలో రాక అసంపూర్తిగానే పనులు నిలిచిపోయింది. ఇటీవల నిధులు మంజూరైనా టెండర్‌కు పిలిచి ఓపెన్ చేయక పోవడంతో పనుల్లో జాప్యం ఏర్పడుతుంది.

మండల కేంద్రంలో నూతన తహసీల్దార్ కార్యాలయ భవనానికి రెండేళ్ల క్రితం పంచాయతీరాజ్‌లో రూ.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ ఆ నిధుల వరకే నిర్మాణ పనులు చేపట్టి మరో విడుత నిధుల కోసం వేచిచూస్తున్నారు. ఇటీవల కాలంలో రెండో విడుతలో భాగంగా డీఎమ్ఎఫ్‌టీ కింద రూ.65 లక్షలు మంజూరయ్యాయి. కాగా వాటికి టెండర్‌కు పిలిచారు. కానీ ఓపెన్ చేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. దీంతో పనులు సగభాగం స్లాబ్‌తోనే ఆగిపోయాయి. పిచ్చి మొక్కలతో ఆ స్థలం దర్శనమిస్తోంది.

ఇరుకు గదుల్లో నిర్వహణ

తహసీల్దార్ పక్కనే ఉన్న ఓ కార్యాలయంలో ఇరుకు గదుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే కంప్యూటర్లు, టేబుళ్లు, బీరువాలు పెట్టేందుకు సరిపడా గదులు లేవు. వివిధ రకాల సర్టిఫికెట్లు పెట్టేందుకు కూడా సరిపోవడంలేదు. సిబ్బంది సైతం ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అధికారులు వచ్చిన క్రమంలో కూర్చోనేందుకు విశాలంగా లేదు. దీంతో ఆరుబయటనే మాట్లాడి వెళ్తున్నారు. కనీసం మరుగుదొడ్లు కూడా లేని పరిస్థితి. సమస్యలు విన్నవించుకునేందుకు, సర్టిఫికెట్ల కోసం ప్రతీ రోజు మండల ప్రజలు కార్యాలయానికి వస్తుంటారు. ఈ క్రమంలో లోపలికి ఒకరి తర్వాత ఒక్కరుగా వెళ్లివస్తుంటారు. దీంతో సమయం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదుల సంఖ్యలో ప్రజలు సమస్యలు విన్నవించుకునేందుకు వస్తుండగా తహసీల్దార్‌నే బయటకు పిలవాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.

సమయం వృథా అవుతోంది..

గ్రామాల్లో సమస్యలు చెప్పుకునేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వస్తే సమయం వృథా అవుతోంది. రెండేళ్లుగా భవనం నిర్మాణ పనులు పూర్తికాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి పనులు వేగవంతం చేయాలి.

– వాగబోయిన రమేష్, గుండాల

టెండర్లలో వేగం పెంచాలి

నూతన తహసీల్దార్ భవన నిర్మాణానికి రెండో సారి వచ్చిన నిధులకు త్వరగా టెండర్ ప్రక్రియ వేగవంతం చేయాలి. నిర్మాణ దశలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరుతుంది. దీనిపై ఎమ్మెల్యే, జిల్లా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

– ముక్తి సత్యం, మాజీ ఎంపీపీ

రూ.65 లక్షల నిధులు..

గతంలో రూ.50 లక్షలు విడుదల కాగా పనులు ప్రారంభం అయ్యాయి. రెండో విడుతలో మరో రూ.65 లక్షలు విడుదల అయ్యాయి. టెండర్‌కు పిలవడం జరిగింది. త్వరలోనే ఓపెన్ చేసి పనులు ప్రారంభిస్తాం.

– రామారావు, పీఆర్ డీఈ